
సాక్షి
అన్నమయ్య జిల్లా
గురువారం । 15 । మే । 2025



నేర పరిశోధనలో ఫోరెన్సిక్ ఆధారాల సేకరణే కీలకం

ముఖ్యమైన కేసుల దర్యాప్తునకు నేర పరిశోధనలో సేకరించిన ఫోరెన్సిక్ ఆధారాలే ఎంతో కీలకమని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. - 8లో



కూటమిలో చేరి.. భూమిని దోచేసి!

టీడీపీ మద్దతుతో ఇన్‌చార్జి ఎంపీపీని దక్కించుకున్న లక్ష్మీదేవి భర్త భూ ఆక్రమణలకు పాల్పడుతున్నట్లు గ్రామస్తులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.90	రూ.104
రెండోరకం	రూ.66	రూ.88

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 710 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

పాజిటివ్ థింకింగ్‌కు ప్రపంచాన్ని మార్చే శక్తి

కురబలకోట : పాజిటివ్ థింకింగ్ (సానుకూల దృక్పథం)కు దైనందిన జీవితాన్ని ప్రభావితం చేయడంతో పాటు ప్రపంచాన్ని మార్చే శక్తి ఉంటుందని రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు, ప్రముఖ న్యాయవాది, సైకాలజిస్టు అతిక్ అహమ్మద్ అన్నారు. అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో పాజిటివ్ థింకింగ్ శక్తిపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాజిటివ్ థింకింగ్ జీవితాలను మార్చ గల గొప్ప ఆయుధంగా చెప్పవచ్చన్నారు. ప్రతి కూలాన్ని కూడా అనుకూలంగా మారుస్తుందన్నారు. లక్ష్య సాధనకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. మనస్సును మార్చడంతో పాటు వ్యక్తులపై ప్రభావం చూపుతుందన్నారు. పాజిటివ్ థింకింగ్ విజయానికి సోపానం కాగలదని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేట రూరల్ : ప్రముఖ శైవ పుణ్య క్షేత్రమైన శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి దేవస్థానానికి నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు దేవదాయశాఖ కార్యనిర్వహణ అధికారి గంగవరం కొండారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి 20 రోజులలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు వ్యాసరచన పోటీలు

రాయచోటి జగదాంబసెంటర్ : స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి సంబంధించి బీట్ ది హీట్ అనే అంశంపై రాయచోటి పట్టణంలోని డైట్ కళాశాలలో ఈ నెల 15వ తేదీ ఉదయం 10 గంటలకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 6-10వ తరగతులు చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గెలుపొందిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ఆయన తెలిపారు.

వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందించాలి



ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి జగదాంబసెంటర్ : విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాయచోటిలోని ఏపీ ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో రూ.10 లక్షలతో రీ మోడల్ చేసిన ఎస్‌ఈ కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు సిబ్బంది సమన్వయంతో పనిచేసి విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. కొత్తగా అన్నమయ్య జిల్లా ఏర్పడిన సందర్భంగా రాయచోటిలో ఏపీఎస్పీడీసీఎల్ నూతన ఎస్‌ఈ కార్యాలయం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి, పాల్గొన్నారు.

అధికారుల మాక్‌డ్రిల్



భవంతుల్లో చిక్కుకున్న వారిని ఎలా కాపాడాలో తెలియజేస్తున్న అధికారులు

రాయచోటి టౌన్ : ఊహించని విపత్తులు సంభవిస్తే ప్రజలు ఏ విధంగా ఎదుర్కోవాలనే విషయంపై రాయచోటి ఆర్టీసీ బస్టాండ్‌లో రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక శాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ సివిల్ మాక్ డ్రిల్ నిర్వహించారు.కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తత నేపథ్యంలో హోంశాఖ ఆదేశాల మేరకు భారత పౌరులు ఏ విధంగా సన్నద్ధం అవ్వాలనే విషయాల గురించి వివరించి చెప్పారు. ఈసందర్భంగా రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతానికి యుద్ధం ఆగిందని భవిష్యత్‌లో అనివార్యమైతే ప్రజలు తమని తాము ఎలా రక్షించుకోవాలో తెలియచేసేందుకు ఈ మాక్ డ్రిల్ ప్రదర్శన చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా అగ్నిమాపక అధికారి అనిల్‌కుమార్ మాట్లాడుతూ యుద్ధ వాతావరణం నెలకొన్న సమయంలో సైరన్ మోగుతుందని అప్పుడు ఎలా అప్రమత్తం అవ్వాలో ప్రదర్శన ద్వారా తెలియజేశామని చెప్పారు. అలాగే ప్రమాద స్థలాల నుంచి సురక్షిత ప్రాంతాలకు ఎలా తరలించాలో కూడా వివరించారు. కార్యక్రమంలో రాయచోటి తహసీల్దార్ నరసింహకుమార్, జిల్లా ఆరోగ్యశాఖ అధికారి ఉషశ్రీ, రాయచోటి సీఐ వెంకట చలపతి,ఫైర్ స్టేషన్ అధికారి వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

మేయర్‌పై దొంగదెబ్బ!

- సురేష్‌బాబుపై కక్షగట్టిన ఎమ్మెల్యే మాధవిరెడ్డి
- అధికారుల తప్పిదాన్ని బూచిగా చూపెట్టి ప్రభుత్వం ద్వారా చర్యలు
- కార్పొరేషన్‌లో రూ.36లక్షల కాంట్రాక్టు పనులు చేశారని అనర్హత వేటు



కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి పాతరేసింది. కార్పొరేషన్‌లో సీటు వేయలేదనే అక్కసుతో కుతంత్రాలకు తెరలేపింది. నిస్సిగ్గుగా రోత ఫిరాయింపు రాజకీయాలు చేసింది. అయినా తాము అనుకున్న లక్ష్యం నెరవేరదని తెలుసుకుని దొంగ దెబ్బ తీసింది. అవినీతి రుజువుకాకున్నా మేయర్‌పై అనర్హత వేటు వేయించి అక్కసు వెళ్లగక్కింది. దుష్ట సంస్కృతికి తెరలేపిన నేతగా ఎమ్మెల్యే మాధవిరెడ్డి చరిత్రలో నిలిచిపోనుంది.



కడప కార్పొరేషన్ కార్యాలయం (ఇన్‌సెట్) మేయర్ సురేష్ బాబు

సాక్షి ప్రతినిధి, కడప : కడప మేయర్ సురేష్‌బాబుపై దొంగదెబ్బ కొట్టారు. కుటుంబ సభ్యుల పేరుతో ఉన్న వర్ధిని కన్‌స్ట్రక్షన్స్ సంస్థ రూ.36 లక్షలు కాంట్రాక్టు పనులు చేశారని బూచిగా చూపెట్టి అనర్హత వేటు వేశారు. ఆమేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వం జీఓ ఆర్టీ నంబర్ 446 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. ఎమ్మెల్యే మాధవీరెడ్డి పగబట్టి దొంగ దెబ్బతీశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కొలేమని అంచనాకు వచ్చిన తర్వాత ప్రభుత్వం ద్వారా చర్యలు తీసుకున్నారు. అధికారం అడ్డుపెట్టుకొని అనర్హత వేటు వేశారని విశ్లేషకులు భావిస్తున్నారు.

కడప కార్పొరేషన్‌లో లేని ప్రొటోకాల్ కావాలని ఎమ్మెల్యే మాధవి రెడ్డి పట్టుబట్టారు. సాధ్యపడకపోవడంతో కడప మేయర్ సీటుపై కన్నేశారు. ఎలాగైనా కైవసం చేసుకోవాలనే అంచనాకు వచ్చారు. సామ బేధ దండోపాయాలను ప్రయోగించినా 8మంది కార్పొరేటర్లు మాత్రమే మొగ్గు చూపారు. అవిశ్వాసంతో దింపలేమని స్పష్టమైంది. లొసుగులు, లోటుపాట్లుపై దృష్టి పెట్టారు. మేయర్ సురేష్‌బాబు తనయుడు అమరేష్ కాంట్రాక్టు సంస్థను రిజిస్టర్ చేసుకున్న విషయాన్ని పసిగట్టారు. కాంట్రాక్టు అనుభవం కోసం చేసిన పనులను బూచిగా చూపెట్టారు. ముందుగా కార్పొరేషన్‌ను అడ్డుపెట్టుకొని అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలు చేశారు. విజిలెన్సు ఎన్‌ఫోర్స్‌మెంటుకు ఫిర్యాదు చేశారు. పనుల్లో ఎలాంటి అవినీతి లేదని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు ధ్రువీకరించింది. మున్సిపల్ యాక్టుపై దృష్టి సారించారు. అధికారంలో ఉన్న మేయర్ కుటుంబ సభ్యులు కార్పొరేషన్‌లో పనులు చేపట్టరాదనే ఫిర్యాదు ఆధారంగా ప్రభుత్వం ద్వారా చర్యలు చేపట్టారు.

అధికారులపై చర్యలేవీ....

ఆగమేఘాలపై మేయర్ సురేష్‌బాబుపై చర్యలు తీసుకున్న ప్రభుత్వ పెద్దలు కారకులైన అధికారులను విస్మరించారు. మేయర్ మాత్రమే టార్గెట్‌గా వ్యవహరించారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. మేయర్ కుటుంబ సభ్యుల పేరుతో ఉన్న కాంట్రాక్టు సంస్థ కార్పొరేషన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకుంటుంటే అభ్యంతరం చెప్పాల్సింది ఎవరు? చట్టం తెలిసిన అధికారులే కదా? మున్సిపల్ నిబంధనలు ప్రకారం కార్పొరేషన్‌లో పనులు చేయరాదంటూ అభ్యంతరం చెప్పాలి కదా? ఎందుకు అభ్యంతరం చెప్పలేదనే ప్రశ్న ఉదయిస్తోంది. అప్పటి అధికారులపై చర్యలు తీసుకోకపోవడం వెనుక రాజకీయ కోణం స్పష్టంగా కన్పిస్తోందని పరిశీలకులు వెల్లడిస్తున్నారు. పైగా కార్పొరేషన్ పరిధిలో రూ.10లక్షల లోపు పనులు అధికారుల కనుసన్నల్లోనే చేపట్టనున్నారు, స్టాండింగ్ కమిటీ దృష్టికి కూడా రావు. రూ. 50లక్షల పైబడిన పనులు మాత్రమే జనరల్ బాడీకి చేరనున్నాయి. మరోవైపు రూ.36లక్షల కాంట్రాక్టు పనుల్లో అవినీతి లేదని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు నివేదికలు ఇచ్చాయి. అయినా ఇలా అనర్హత వేటు వేయడం రాజకీయంగా దొంగదెబ్బ కొట్టడమేనని పలువురు వెల్లడిస్తున్నారు.

ఆగమేఘాలపై చర్యలు...

ప్రభుత్వం మేయర్‌పై అనర్హత వేటు వేయాలనే దిశగా అడుగులు వేస్తున్నట్లు మొదటి నుంచి స్పష్టమౌతోంది. మేయర్‌గా సురేష్‌బాబుకు నోటీసు అందకముందే టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే మాధవిరెడ్డి ప్రెస్‌మీట్ పెట్టి నోటీసులు మీడియాకు చూపెట్టడం తెలిసిందే. పైగా మంగళవారం సాయంత్రం మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్‌బాబును విచారించారు. మేయర్ తన వివరణ ఇచ్చిన 24గంటలు కూడా గడవకముందే అనర్హత వేటు ఉత్తర్వులు వెలువడడం గమనార్హం. సీఎంఓ డైరెక్షన్‌లో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి పర్యవేక్షణలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పనిచేసిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

వ్యూహాత్మకంగా దెబ్బకొట్టుతున్న చంద్రబాబు సర్కార్

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ, ఎస్సీ, ఎస్టీలకు పెద్ద పీట వేశారు. 51శాతం స్థానిక సంస్థల్లో వెనుకబడిన వర్గాలకు ప్రాతినిథ్యం వహించాలని సంకల్పించారు. క్షేత్రస్థాయిలో అమలు పర్చారు. మరోవైపు బీసీ, ఎస్సీ, ఎస్టీ ఓట్లతో గద్దెనెక్కిన సీఎం చంద్రబాబు అదే బీసీ, ఎస్సీలను లక్ష్యం చేసుకొని దొడ్డిదారిన దెబ్బకొడుతున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. వైజాగ్, గుంటూరు మేయర్, తిరుపతి డిప్యూటీ మేయర్, మాచర్ల మున్సిపల్ చైర్మన్ స్థానాలను కైవసం చేసుకున్న తీరును వారు వివరిస్తుండడం విశేషం.

● బీసీ నేతపై కక్షసాధింపు చర్యలు



బీసీ నేత కడప మేయర్ సురేష్‌బాబును తొలగించేందుకు కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు చేపట్టింది. తన కుటుంబ సభ్యుల పేరుతో ఉన్న సంస్థ ద్వారా కాంట్రాక్టులు పొందారని ఆరోపణలు మేయర్ పదవినుంచి తొలగిస్తూ జీఓ జారీ చేయడం అన్యాయం. ఈచర్య పూర్తిగా రాజకీయ కక్షసాధింపే. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అణచివేత ధోరణిని అవలంబిస్తోంది. అందులోనూ ముఖ్యంగా బీసీ నేతలపై చర్యలు చేపట్టడం విడ్డూరంగా ఉంది.

– డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్సీ

ఎమ్మెల్యేను ఎంతో గౌరవించాం



ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కడప ఎమ్మెల్యే మాధవీకి కార్పొరేటర్లంతా ఘనంగా స్వాగతం పలికి ఎంతో గౌరవించారు. కానీ ఆమె తమను చులకన భావంతో చూసింది. ఇచ్చిన గౌరవాన్ని నిలబెట్టుకోకుండా మేయర్ ఇంటిపై చెత్త వేయించింది. ఎక్స్ అఫిషియో సభ్యులకు నిబంధనల ప్రకారం ఎక్కడ కుర్చీ వేయాలో అక్కడే వేశారు. దాన్ని ఎమ్మెల్యే అవమానంగా భావించి ఇలా రాద్ధాంతం చేయడం దారుణం.

– రామలక్ష్మణ్‌రెడ్డి, 13వ డివిజన్ కార్పొరేటర్

మేయర్ ఎన్నిక సమయంలోనే ఇవన్నీ చూడాలి



మేయర్‌ను ఎన్నుకునే సమయంలోనే వారికి కాంట్రాక్టులు ఉన్నాయా? వారి కుటుంబ సభ్యులకు కాంట్రాక్టు ఉన్నాయా? అన్న విషయాలను పరిగణలోకి తీసుకోవాలి. మేయర్ ఎన్నిక పూర్తయి 2023లో వర్ధిని కన్‌స్ట్రక్షన్ సంస్థ పుట్టింది. వర్ధిని కన్‌స్ట్రక్షన్స్ రిజిస్ట్రేషన్‌ను అధికారులు రద్దు చేసి ఉండాలి. బీసీ నాయకులనే లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం వారిని పదవుల నుంచి తప్పిస్తోంది.

– బసవరాజు, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ప్రజాస్వామ్యం ఖూనీ



కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయింది. కడప నగర పాలక సంస్థలో 50 స్థానాలకుగాను 49 మంది వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు ఉన్నారు. మేయర్‌ను ఏమి చేసుకోలేక ఎనిమిది మంది కార్పొరేటర్లను అన్ని విధాలుగా భయపెట్టి, మభ్యపెట్టి టీడీపీలో చేర్చుకున్నారు. మేయర్ కుమారుడు చేసిన కాంట్రాక్టు పనుల్లో అవినీతి జరిగిందని విజిలెన్స్ విచారణలో చెప్పలేదు.

– మల్లికార్జున, 10వ డివిజన్ కార్పొరేటర్

అధికారకాంక్ష ?

- టీడీపీ, జనసేనలో చేరికకు ఫలించని ప్రయత్నాలు.
- బీజేపీతో కుదిరిన చర్చలు.. పదవికి రాజీనామా
- మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ బీజేపీలో చేరికపై మండిపడుతున్న మైనార్టీలు

రాయచోటి : రాజకీయాలంటే జనం అసహ్యించుకునేలా మార్చేస్తున్నారు. అధికారం, డబ్బు ముందు విలువలు, మర్యాదలు మంట కలిసి పోతున్నాయి. ఊసర వెల్లి కంటే దారుణంగా రంగులు మారుస్తున్న రాజకీయ నాయకుల వేషాలను చూస్తుంటే రాజకీయాల వైపు మొగ్గు చూపుదామన్న యువత ఆలోచన చిన్న బుచ్చుకుంటుంది. నమ్మిన సిద్ధాంతాలు..బాధ్యతతో ఉంటామని బాసలు చేసి అందుకున్న పదవులను స్వార్థ పూరిత రాజకీయాల కోసం తృణప్రాయంగా త్యజించడం విమర్శలకు దారితీస్తుంది. కొన్ని రాజకీయ పార్టీలు కూడా దశాబ్దాల పాటు పార్టీ కోసం సేవ చేసిన వారిని కాదని డబ్బే పరమావధిగా భావించి వేరెవ్వరికో పదవులు కేటాయించడం ఎంతవరకు సమంజసం అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఓ సాధారణ కుటుంబీకురాలిగా ఉన్న మహిళకు అప్పగించిన పదవీ బాధ్యతలను అధికార కాంక్షతో... మరో పార్టీ ముందు ఫణంగా పెట్టి నమ్మిన వ్యక్తులను, సిద్ధాంతాలను తుంగలో తొక్కి..సొంత ఊరికి చెడ్డ పేరు వస్తుందన్న ఆలోచన లేకుండా పార్టీ మారడంపై ఊరి జనమంతా ఈసడించుకుంటున్నారు.

బేరం కుదిరింది!

నిజం.. అధికార కాంక్షనే.. ఎమ్మెల్సీ, మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ పదవులను వదులుకుంటే తగిన ఫలితం ఉంటుందన్న బేరం కుదిరింది అన్న ప్రచారం దావానంలా వ్యాపించింది.సాధారణ గృహిణిగా ఉన్న ముస్లిం మైనారిటీ మహిళ మయాన జకియాఖానమ్‌కు నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవిని కేటాయించారు. రాయచోటిపై ఉన్న అభిమానం, ముస్లిం మైనార్టీల పట్ల ఉన్న ప్రేమ, మహిళల పట్ల ఉన్న గౌరవంతో మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ పదవి కూడా అప్పగించి సముచిత స్థానాన్ని కల్పించారు. అధికారంలో ఉన్నన్ని రోజులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంతో కలిసి నడిచిన జకియాఖానమ్ రాష్ట్రంలో అధికారం మార్పిడితో ఒక్కసారిగా ఆమె ఆలోచనలు మార్పులు మొదలయ్యాయి. నాటి నుంచి పార్టీకి దూరంగా ఉంటూ వస్తోంది. రాయచోటిలోని ఆమె కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు వైఎస్ కుటుంబాన్ని వదల వద్దని వారించినా వినకుండా పార్టీ పదవులను మరో పార్టీకి బేరం పెట్టిందన్న విమర్శలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ పార్టీతో జతకట్టేందుకు ముమ్మర ప్రయత్నాలు చేసింది. చేసిన ప్రయత్నాలు ఫలిస్తున్న సమయంలో తిరుపతి తిరుమల దేవస్థానం దర్శనం టికెట్ల విక్రయాల్లో భారీగా రాబడి సాగించిందన్న విమర్శలు వినిపించాయి. ఒక్కో లెటర్‌కు రూ. 20 నుంచి 30 వేల వరకు భక్తుల నుంచి డబ్బులు వసూళ్లు చేసింది అన్న వాస్తవాలు బయటపడిన విషయం తెలిసిందే. దీంతో టీడీపీ, జనసేన పార్టీలు ఆమెను పార్టీలో చేర్చుకోవడానికి వెనకడుగు వేశాయి. రాజకీయ మార్పునకు సమయం అనుకూలించలేదని భావించిన జకియా ఖానమ్ బీజేపీ నాయకులతో రాజకీయ సంబంధాలను పెంచుకున్నట్లు సమాచారం.ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి బీజేపీలో చేరితే తగిన గుర్తింపుతో పాటు ప్రాధాన్యత కలిగిన పదవులను ఇస్తామని ఒప్పించినట్లు విశ్వసనీయ సమాచారం. అదేవిధంగా జాతీయస్థాయిలో ముస్లిం మైనార్టీలకు చెందిన ఒక పదవిని ఇచ్చేందుకు సంధి కుదుర్చుకున్నట్లు ఆమె అనుయాయుల ద్వారా తెలిసింది. దీంతో వెంటనే పదవులకు రాజీనామా చేయడం, బీజేపీలో చేరడం జరిగిపోయాయి.



బీజేపీ కండువా కప్పుకున్న మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానమ్

▶▶ అవమాన పరిచారంటూ ఆగ్రహం

రాయచోటి మైనార్టీలు అంటే వైఎస్సార్ కుటుంబానికి ఎనలేని అభిమానం.అలాంటి కుటుంబం ఇచ్చిన పదవిని ముస్లిం మైనార్టీలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న పార్టీ పాదాల వద్ద ఫణంగా పెట్టడంపై ముస్లిం మైనార్టీ సోదరులు మండిపడుతున్నారు. రాయచోటి ముస్లిం మైనార్టీలను విజయవాడ వీధుల్లో అవమానపరిచారు అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జూన్ 15 నుంచి గిరిజన గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం

– జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి : జూన్ 15 నుంచి 30వ తేదీ వరకు గిరిజన గ్రామాలలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రచారాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ బుధవారం తెలిపారు. దార్తి ఆబాజన్ జాటియా గ్రామ ఉత్కర్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రచారం చేయనున్నట్లు చెప్పారు. జిల్లాలో 4 మండలాల్లోని 17 గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు.ఆధార్, రేషన్ కార్డు లేని వారికి కార్డులను అందజేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయంతో నిర్వహించే కార్యక్రమం పక్కాగా అమలు కావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాలను గిరిజన ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

31 మంది ఎస్‌ఐల బదిలీ

రాయచోటి : జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పోలీసుల బదిలీల్లో మరోమారు తన మార్కును ప్రదర్శించారు. రెండు నెలల కిందట జిల్లాలో 250 మందికి పైగా పోలీస్ సిబ్బంది బదిలీలు చేపట్టిన విషయం తెలిసిందే. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి విడుదల చేసిన ఎస్‌ఐల బదిలీల్లో 31 మందికి స్థానచలనం కల్పించారు. వీరంతా ఒకటి రెండు రోజుల్లో విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎస్‌ఐలు	బదిలీ అయిన స్థానం
ఎం.విష్ణువర్ధన్	రాయచోటి అర్బన్ పీఎస్-1
జె.నరసింహారెడ్డి	సైబర్ క్రైమ్ సెల్-1 అన్నమయ్య జిల్లా
మహమ్మద్ అబ్దుల్‌జహీర్	డీఎస్‌బీ-1 అన్నమయ్య జిల్లా
ఎం.లోకేష్	రాయచోటి అర్బన్ పీఎస్-2
జి.బాలాజీనాయక్	పీలేరు అర్బన్ పీఎస్-2
టివిఎన్ చిరంజీవి	వీరబల్లి పీఎస్
బి.మోహన్‌నాయక్	సీసీఎస్-3, అన్నమయ్య జిల్లా
వి.మల్లిఖార్జునరెడ్డి	నందలూరు పీఎస్
సి.మధు రామచంద్రుడు	డీసీఆర్‌బి-1, అన్నమయ్య
పి.వెంకటేశు	రాజంపేట అర్బన్‌పీఎస్-1
ఎం.రామదాసు	రాజంపేట అర్బన్ పీఎస్-2
జి.నవీన్‌బాబు	గుర్రంకొండ పీఎస్
బివి శివకుమార్	పుల్లంపేట పీఎస్
ఎస్.అన్సర్‌బాషా	మదనపల్లి-1 టౌన్ అర్బన్ పీఎస్-2
బి.శ్రీనివాస్‌నాయక్	మహిళా అర్బన్ పీఎస్-2, అన్నమయ్య
పి.శ్రీహరి	మహిళా అర్బన్ పీఎస్-3, అన్నమయ్య
డి.బాలరాజు	మహిళా అర్బన్ పీఎస్-4, అన్నమయ్య
సి.హరిహరప్రసాద్	పీటీఎం పీఎస్
జి.చంద్రమోహన్	మదనపల్లె తాలూకా, అర్బన్ పీఎస్-1
జి.గాయత్రి	మదనపల్లె తాలూకా అర్బన్ పీఎస్-2
జి.సాయినాథ్ ప్రసాద్	మదనపల్లె టూ టౌన్ అర్బన్ పీఎస్-2
జి.రవికుమార్	రామసముద్రం పీఎస్
సి.ఉమామహేశ్వర్‌రెడ్డి	తంబళ్లపల్లి పీఎస్
ఎం.వెంకటేశ్వర్లు	పెద్దమండెం పీఎస్
ఎస్.శ్రీనివాసులురెడ్డి	డీఎస్‌బీ టు అన్నమయ్య
పివి రమణ	డీఎస్‌బి-3, అన్నమయ్య
బి.సూర్యనారాయణ	డీఎస్‌బి-2 అన్నమయ్య
డి.సుబ్రమణ్యంనాయక్	డీఎస్‌బీ-5, అన్నమయ్య
ఎస్.జయరామప్ప	డీసీఆర్‌బీ-2, అన్నమయ్య
ఎస్.శివకామని	పీసీఆర్-2, అన్నమయ్య
వి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి	రైల్వే కోడూరు అర్బన్ పీఎస్

వ్యాయామ విద్యకు మంగళం

- పీడీ రిటైర్ అయితే ఆ పోస్టు రద్దు
- ఇంటర్ కాలేజీలకు పీడీ పోస్టుల భర్తీ లేనట్లేనా!



ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ



జూనియర్ కాలేజీలో పీడీ పోస్టులు రద్దు చేయవద్దని కోరుతూ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌కు వినతి ప్రతం అందజేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయ సంఘ నాయకులు, విద్యార్థులు (ఫైల్)

మదనపల్లె సిటీ : కేజీ నుంచి పీజీ వరకు చదువుకునే విద్యార్థులకు వ్యాయమ విద్య కీలకం. అటువంటి విద్యను కూటమి ప్రభుత్వం సమూలంగా దూరం చేసే కుట్ర చేస్తోంది. క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఒక పక్క ప్రభుత్వం మెగా డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా కింద పోస్టులను నిర్దేశించింది. ప్రత్యేకంగా క్రీడల్లో ప్రతిభ, సీనియారిటీ ద్వారా కోటాలో ఉద్యోగాలు కల్పించనుంది. ఈ పోస్టులు భర్తీ కేవలం 6 నుంచి 10వ తరగతి పాఠశాలల వరకే పరిమితం. ఇంటర్మీడియట్ కళాశాలకు మాత్రం పీడీ పోస్టులను భర్తీ చేయకపోగా ఉన్న వాటిని కూడా సబ్జెక్ట్ అధ్యాపకుడిగా కన్వర్షన్ చేస్తోంది.

ఇంటర్మీడియట్ కాలేజీల్లో ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు ఇకపై ఉండవు. ఇప్పటికే ఖాళీలను భర్తీ చేయకపోగా,కొత్త ఎంపికలను కూడా నిలిపివేసింది. పీడీ పోస్టులను సబ్జెక్టు అధ్యాపకుడిగా కన్వర్షన్ చేస్తూ తీసుకున్న నిర్ణయంతో ఇంటర్ విద్యార్థులు వ్యాయామ విద్యకు దూరం కానున్నారు. జిల్లాలో 21 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉన్నాయి.వీటిలో మదనపల్లె ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ, ప్రభుత్వ జూనియర్ కాలేజీ రాజంపేట, ప్రభుత్వ జూనియర్ కాలేజీ , రైల్వేకోడూరులలో మాత్రం పీడీలు పని చేస్తున్నారు. రాయలసీమ జోన్ పరిధిలోని చిత్తూరు, కర్నూలు, వైఎస్సార్ కడప జిల్లా, అనంతపురం జిల్లాల్లో 185 పీడీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఉన్నత పాఠశాలల్లో పీఈటీ, పీడీ పోస్టులు ఉన్నాయి. పాఠశాల స్థాయిలో విద్యార్థులు క్రీడల్లో రాణిస్తున్నారు. తిరిగి డిగ్రీ కాలేజీల్లో కూడా పీడీ పోస్టులు ఉన్నాయి. కానీ మధ్యలో ఇంటర్ కాలేజీల్లో పీడీ పోస్టులు లేనందున వల్ల విద్యార్థులు క్రీడల్లో రాణించలేకపోతున్నారు. క్రీడామైదానాలు ఉన్న జూనియర్ కాలేజీల్లో పీడీ పోస్టులు ఉండేవి. అది కూడా ప్రస్తుతం లేకుండా చేస్తున్నారు. ఇంటర్ చదివే విద్యార్థులకు వ్యాయామ విద్య అందని ద్రాక్షగా మారనుంది.

పోస్టు కన్వర్షన్ ఇలా

జూనియర్ కాలేజీల్లో ఫిజికల్ డైరెక్టర్ (పీడీ)గా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందితే ఆ కాలేజీలో ఇక పీడీ పోస్టుకు మంగళం పలకనున్నారు. ఈ పోస్టులను అదే కాలేజీ లేదా పక్క మండలాల్లోని కాలేజీల్లో సబ్జెక్ట్ అధ్యాపకుడిగా కన్వర్షన్ చేసి పోస్టులను అక్కడ భర్తీ చేస్తున్నారు. విశాలమైన క్రీడామైదానాలు ఉన్నప్పటికీ పీడీ పోస్టులను కన్వర్ట్ చేసి పోస్టులను తగ్గించుకునేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

పీడీ పోస్టులు కొనసాగించాలి



జూనియర్ కాలేజీల్లో పీడీ పోస్టులు కొనసాగించాలి. దీనిపై ఇంటర్మీడియట్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశాం. జూనియర్ కాలేజీలో విద్యార్థులు క్రీడల్లో రాణిస్తున్నారు. ప్రభుత్వం దీనిపై ఆలోచించి న్యాయం చేయాలి.

– నరేష్, క్రీడాభారతి జిల్లా కార్యదర్శి

క్లుప్తంగా

నిధుల స్వాహాపై విచారణ ప్రారంభం

మదనపల్లె : మదనపల్లె మున్సిపాలిటీలో 2022-23 గుత్తలకు సంబంధించి గుత్తదారుడు చెల్లించిన రూ.29.50 లక్షలకు చేతిరాత రశీదులతో నిధులు స్వాహా కథనంపై అధికారులు విచారణ చేపట్టారు. బుధవారం కమిషనర్ ప్రమీల దీనికి సంబంధించి అప్పటి అధికారులను విచారించారు. ఇప్పటికే తీసుకున్న చర్యలను సమీక్షించిన ఆమె న్యాయపరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రశీదులు ఇచ్చిన ఉద్యోగి ఆ రశీదులను చేతిరాతతో ఎందుకిచ్చారు, ఎంత సొమ్ము తీసుకున్నారన్న దానిపై పూర్తిస్థాయిలో విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఇప్పటిదాకా సమగ్రమైన విచారణ, ఉన్నతాధికారుల పరిశీలన లేకపోవడంతోనే ఇప్పటికి బాధ్యులను గుర్తించడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది.

వివాహిత ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న నరసమ్మ

రాజంపేట : రాజంపేట పట్టణ శివారులోని రామ్‌నగర్‌కు చెందిన ఓ వివాహిత నరసమ్మ (45) పోలి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. తన భర్త మద్యానికి బానిసై నరసమ్మతో గొడవపడి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోవడంతో ఇంటికి రాడనే మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

టిప్పర్ ఢీకొని ట్రాక్టర్ బోల్తా

చింతకొమ్మదిన్నె : వరి గడ్డిలోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక వైపున టిప్పర్ ఢీకొనడంతో ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ సంఘటన బుధవారం మధ్యాహ్నం చింతకొమ్మదిన్నె మండలం ఆజాద్ నగర్ వద్ద జరిగింది. ఈ ప్రమాదంలో వరిగడ్డి కట్టలు చెల్లాచెదురయ్యాయి. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోయినా కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

ప్రొద్దుటూరు ఆస్పత్రిలో గుర్తు తెలియని మృతదేహాలు



మృతి చెందిన సుబ్బరాయుడు, బ్రహ్మయ్య

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక జిల్లా ఆస్పత్రిలోని మార్చురీలో ఇరువురు గుర్తు తెలియని వ్యక్తుల మృతదేహాలను భద్రపరిచారు. సుబ్బరాయుడు (60) అనే వ్యక్తి అనారోగ్యం కారణంగా ఈ నెల 12న జిల్లా ఆస్పత్రిలోని ఎంఎం-2 వార్డులో చేరాడు. మంగళవారం మృతి చెందాడు. ఐపీ రిజిష్టర్‌లో అతని పేరు మినహా ఊరు పేరు, సెల్ నంబర్ లేకపోవడంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. అలాగే బ్రహ్మయ్య (70) అనే వ్యక్తి ఈ నెల 11న అనారోగ్యంతో జిల్లా ఆస్పత్రిలో చేరాడు. చికిత్స పొందుతూ 12న అర్ధరాత్రి సమయంలో మృతి చెందాడు.

నేర పరిశోధనలో ఫోరెన్సిక్ ఆధారాల సేకరణే కీలకం

- అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు
- నేరగాళ్ల ఎత్తుగడలకు సాంకేతిక పరిజ్ఞానంతో అడ్డుకట్ట
- ఫోరెన్సిక్ సైన్స్ ఎవిడెన్స్ మేనేజ్‌మెంట్‌పై ఒక్కరోజు శిక్షణా తరగతులు


పోలీసు అధికారులకు అధునాతన సాంకేతిక వినియోగంపై వివరిస్తున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : టెక్నాలజీ ఊపందుకున్న ప్రస్తుత పరిస్థితులలో ముఖ్యమైన కేసుల దర్యాప్తునకు నేర పరిశోధనలో సేకరించిన ఫోరెన్సిక్ ఆధారాలే ఎంతో కీలకమని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు దర్యాప్తు అధికారులకు సూచించారు. రాష్ట్ర డీజీపీ ఆదేశాలు, కర్నూలు రేంజ్ డీఐజీ సూచనల మేరకు బుధవారం అన్నమయ్య జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ఫోరెన్సిక్ సైన్స్ ఎవిడెన్స్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరం చేసిన వ్యక్తి శిక్ష నుంచి తప్పించుకోకుండా నేర స్థలంలో సాక్ష్యాధారాల సేకరణ, వాటి భద్రతా ప్రమాణాలు ఎలా పాటించాలి అనే విషయాలపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలని సూచించారు. పోలీసు అధికారులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని దర్యాప్తు పద్ధతులపై లోతైన అవగాహన కలిగి ఉండాలన్నారు. కేసుల దర్యాప్తు విషయంలో తప్పుదోవ పట్టించేందుకు నేరస్తులు కొత్త పద్ధతులను ఉపయో గిస్తున్న సందర్భంలో వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అత్యాధునిక పరిజ్ఞానాన్ని ఈ శిక్షణా తరగతులలో అందిపుచ్చుకోవాలన్నారు. ఫోరెన్సిక్ సైన్స్‌లో గల అన్ని విభాగాలకు సంబంధించిన నిష్ణాతులైన వారితో ఈ శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల నుంచి పోలీసు అధికారులు శిక్షణా తరగతులలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట సబ్ డివిజన్ ఏఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే, విజయవాడ ఫోరెన్సిక్ నిపుణులు ఇ.కిరణ్ కుమార్, ఎం.మురళీ, అనంతపురం ఆర్‌ఎఫ్‌ఎస్‌ఎల్ అధికారులు కె.జయరాజు, వై. కుళాయమ్మ, జిల్లాలోని సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఏపీఆర్‌జేసీ, పాలిసెట్ ఫలితాల్లో విశ్వం విజయకేతనం


ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న విశ్వనాథరెడ్డి, విశ్వచందన్‌రెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : ఏపీఆర్‌జేసీ, పాలిసెట్ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తిరుపతిలోని విశ్వం విద్యాసంస్థ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశారని ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు.

ఏప్రిల్ 25న నిర్వహించిన ఏపీఆర్‌జేసీ పరీక్షా ఫలితాల్లో వై.దేదీప్య రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు, కె.మునిరూపేష్ 7వ ర్యాంకు, జె.అంజలి 9వ ర్యాంకు, మనీషా 10వ ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు. వీరితో పాటు రేవంత్, అబ్దుల్ ఖాదర్, యోగి, సమత, భవ్యశ్రీ గీతిక, రోషన్, ట్వింకిల్, సంతోష్, భువన, కార్తికేయ తదితరులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. అలాగే పాలిసెట్ ఫలితాల్లో ఎం.కావ్య 120 మార్కులకు 117 మార్కులు సాధించి బాలికల విభాగంలో జిల్లా స్థాయిలో ఉత్తమ ర్యాంకును సాధించినట్లు తెలిపారు. అలాగే కిమ్యశ్రీ 116, కె.నిత్యశ్రీ 114, అబ్దుల్ ఖాదర్ 113, సుజినిరెడ్డి, చాతుర్య, రాజకుమారీలు 112, ఎస్.రోషన్ 111, చేతన్‌రెడ్డి 110, జస్మిత 109 మార్కులతో జిల్లా స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆ విద్యాసంస్థ అకడమిక్ డైరెక్టర్ ఎస్. విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ తులసీ విశ్వనాథరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

వ్యక్తిపై హత్యాయత్నం

కడప అర్బన్ : వీరపునాయునిపల్లె మండలం బూసిరెడ్డిపల్లెకు చెందిన వడ్డారపు గంగరాజు (60) అనే వ్యక్తిపై ఈనెల 13వ తేదీన సూరారెడ్డి అనే వ్యక్తి హత్యాయత్నం చేశాడు. తమ పొలంలో పనులు చేసుకుంటూ ఉండగా, పాతకక్షలను మనసులో పెట్టుకుని అదే గ్రామానికి చెందిన సూరారెడ్డి రాయితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. బాధితుడిని తొలుత వేంపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. బాధితుడి వెన్నెముక తీవ్రంగా దెబ్బతిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంఘటన జరిగిన తరువాత తాము పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు నిందితులపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోలేదని వారు వాపోతున్నారు. పోలీసులు చర్యలు తీసుకుని తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' పటిష్టంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్

రాయచోటి : ఈనెల 17న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా పటిష్టంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలో ఈనెల మూడో శనివారం చేపట్టే స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల నిర్వహణ, జిల్లా స్థూల దేశీయోత్పత్తి, ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమాల అమలు తదితర అంశాలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం జిల్లాకు ప్రత్యేకంగా నియమించిన జోనల్ అధికారి ఈనెల 16న జిల్లాలో పర్యటించనున్నట్లు జేసీ తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

బద్వేలు అర్బన్ : స్థానిక పోరుమామిళ్ల బైపాస్‌రోడ్డు నుంచి అగ్రహారం వెళ్లే దారిలో బుధవారం రాత్రి ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. పోరుమామిళ్ల మండలం పెన్నంవారిపల్లె గ్రామానికి చెందిన మల్లికార్జున, కిషోర్ అనే ఇద్దరు యు వకులు ఓ పని నిమిత్తం తమ ద్విచక్ర వాహ నంలో పట్టణానికి వచ్చి తిరిగి వెళుతుండగా బైపాస్‌రోడ్డు మలుపు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గాయపడిన వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు.

కోమటివానిచెరువులో వృద్ధురాలి మృతి


కోమటివానిచెరువులో పడి మృతి చెందిన వృద్ధురాలు

మదనపల్లె రూరల్ : మదనపల్లె పట్టణంలోని కోమటివానిచెరువులో వృద్ధురాలు మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. పట్టణంలోని రెడ్డెప్పనాయుడు కాలనీకి చెందిన రత్నాకర్ ఆచారి భార్య డి.లక్ష్మీదేవమ్మ(80) గత కొంతకాలంగా మానసిక స్థితి బాగోలేక అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం ఇంటి నుంచి కనిపించకుండా పోయిన లక్ష్మీదేవమ్మ సాయంత్రం 5 గంటల సమయంలో కోమటివానిచెరువులో శవమై తేలింది. గమనించిన స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే.. వృద్ధురాలు ప్రమాదవశాత్తు చెరువులో పడిందా, లేక అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకుందా అనే విషయం దర్యాప్తులో తెలియాల్సి ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారుల మృతిపై మంత్రుల సంతాపం

కడప సెవెన్‌రోడ్స్ : వైఎస్సార్ జిల్లా బ్రహ్మంగారిమఠం మండలంలోని మల్లెపల్లె చెరువులో ఈతకు వెళ్లి ఐదుగురు చిన్నారులు మృతి చెందడంపై రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, సవిత సంతాపం వ్యక్తం చేశారు. చిన్నారుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు. సెలవులకు వచ్చిన బాలురు ఇలా ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వపరంగా అండగా ఉంటామని తెలిపారు. వేసవి సెలవులు కావడంతో, విద్యార్థులు తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నన్ను ఇండియా రప్పించండి

దుబాయ్‌లోని బి.కొత్తకోట వాసి వేడుకోలు


అఫ్జల్

బి.కొత్తకోట : ఇక్కడ బతలేకున్నాను.. ఎలాగైనా నన్ను ఇండియా రప్పిస్తే నా కుటుంబంతో జీవిస్తాను.. అంటూ ఓ యువకుడు పంపిన వీడియో సందేశం వైరల్ అవుతోంది. అందులో బాధితుడు పేర్కొన్న వివరాలు.. బి.కొత్తకోట జయశ్రీ కాలనీకి చెందిన అఫ్జల్ బేగ్ జీవనోపాధి కోసం రెండేళ్ల క్రితం దుబాయ్ వెళ్లాడు. అక్కడ మిత్రులు అతని నుంచి డబ్బు తీసుకుని మోసం చేసి కెనడా వెళ్లిపోయారు. డబ్బు ఇవ్వలేదు. ఈ పరిస్థితుల్లో అక్కడి ప్రభుత్వం అఫ్జల్‌పై కేసు నమోదు చేయడంతో 72 రోజుల పాటు జైలులో ఉండి బెయిల్‌పై బయటకు వచ్చాడు. ప్రస్తుతం ఇంటి నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి, బయటకు వస్తే మళ్లీ జైలుకు పంపుతారు. దీంతో బతకడం కంటే చావే నయం. నాకు నా కుటుంబంతో కలిసి జీవించాలని ఉంది. నన్ను ఇండియాకు రప్పించండి, నాకు ఇలాంటి పరిస్థితి వస్తుందని ఊహించలేదు. ఆర్థికంగా కృంగిపోయానంటూ సందేశంలో పేర్కొన్నాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. చూసిన వారు బాధితున్ని ఆదుకోవాలని కోరుతున్నారు.

ఎర్రచందనం కేసుల్లోని నిందితులకు కౌన్సెలింగ్


అటవీ శాఖ కార్యాలయంలో కౌన్సెలింగ్ ఇస్తున్న రేంజర్ కళావతి

సిద్ధవటం : ఎర్రచందనం అక్రమ రవాణాకు సంబంధించి కేసుల్లోని నిందితులకు బుధవారం కౌన్సెలింగ్ ఇచ్చామని సిద్ధవటం రేంజర్ కళావతి తెలిపారు. ఈ సందర్భంగా అటవీ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రేంజర్ మాట్లాడుతూ పాత ఎర్రచందనం కేసుల్లోని నిందితులు ఇకపై సత్ ప్రవర్తనతో మెలగాలని సూచించామన్నారు. ప్రలోభాలకు లోనై మళ్లీ నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రపంచంలోనే అత్యంత విలువైన ఎర్రచందనాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. యువత ఎర్రచందనం స్మగ్లింగ్‌కు పాల్పడితే వారిపై తీసుకునే చర్యలు, విధించే శిక్షలు, పర్యావరణానికి కలిగే నష్టం వంటి విషయాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ కె. ఓబులేసు, ఎఫ్‌ఎస్‌ఓ సురేష్‌బాబు, బీట్ అధికారులు, అసిస్టెంట్ బీట్ అధికారులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లపై వివక్ష ఎందుకు?


కలెక్టరేట్ ఎదుట కొనసాగుతున్న హెల్త్ కమ్యూనిటీ ఆఫీసర్లు

రాయచోటి : గ్రామీణ ప్రాంతాల ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపడంపై హెల్త్ ఆఫీసర్లు మండిపడ్డారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సమస్యల పరిష్కారం కోరుతూ అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నా కార్యక్రమం బుధవారం 17వ రోజుకు చేరింది. హక్కుల సాధన కోసం సమ్మెబాట పట్టి 17 రోజులు కావస్తున్నా ప్రభుత్వం తరపున అధికారులు ఎలాంటి చర్చలు జరపక పోగా కొత్త ఆంక్షలు విధిస్తుండటం తగదన్నారు. ఇప్పటికే వేతనాలను నిలుపుదల చేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను రాత్రి 8 గంటల సమయంలో ఊరి బయట పొలిమేరల్లో ఉన్న హెల్త్ సెంటర్ దగ్గరకు వెళ్లి అటెండెన్స్ వేయాలని ఆజ్ఞాపించడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని ఏపీఎంసీఏ అన్నమయ్య జిల్లా నాయకులు సాల్మోహన్స్, అహ్మద్ బాషా, శివకుమార్, విజయ్ కుమార్ తదితరులు డిమాండ్ చేశారు.

డాక్టర్ వైఎస్సార్ ఏఎఫ్‌యూలో 12 విభాగాలకు ఏఐసీటీఈ అనుమతి

కడప ఎడ్యుకేషన్ : కడపలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో 2025-2026 విద్యా సంవత్సరానికి 12 టెక్నికల్ విభాగాలన్నింటికీ ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) నుంచి అనుమతి పొడిగింపు (ఎక్స్‌టెన్షన్ ఆఫ్ అప్రువల్) వచ్చిందని వైస్ చాన్సలర్ విశ్వనాథ్‌కుమార్ తెలిపారు. 2023లో మొదటిసారిగా లెటర్ ఆఫ్ అప్రూవల్ (ఎల్‌ఓపీ) పొందిన ఈ కోర్సులు విశ్వవిద్యాలయంలో ప్రతి సంవత్సరం అనుమతిని విజయవంతంగా పొందుతున్నాయన్నారు.

అనుమతి పొందిన విభాగాలలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (ఎస్‌పీఏ), కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ (సీఎఫ్‌ఏ) రెండూ ఉన్నాయి. అలాగే ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ ప్రోగ్రాం, డిజిటల్ టెక్నిక్స్ ఫర్ డిజైన్ అండ్ ప్లానింగ్, ఫెసిలిటీస్ అండ్ సర్వీసెస్ ప్లానింగ్, గేమ్ డిజైన్ టెక్నాలజీస్, కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, ఇంటీరియర్ డిజైన్,ఫైన్ ఆర్ట్స్ ప్రోగ్రామ్స్, అప్లైడ్ ఆర్ట్, ఆనిమేషన్, పెయింటింగ్, స్కల్ప్చర్, ఫొటోగ్రఫీ విభాగాలు ఉన్నాయని వైస్ చాన్సలర్ తెలిపారు. ఏఐసీటీఈ అనుమతి ప్రక్రియలో క్రియాశీలక పాత్ర పోషించిన కమిటీ సభ్యులు బి. నారాయణ రెడ్డి (కోఆర్డినేటర్), పి.ప్రసన్న కుమారి, ఎస్.దినేష్ కుమార్, అన్ని విభాగాల కోఆర్డినేటర్లు, బోధన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి


వలసపల్లెలో విద్యుత్ ప్రమాదాలపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఏపీటీఎస్ విజిలెన్స్ పోలీసులు

మదనపల్లె రూరల్ : విద్యుత్ ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏపీ ట్రాన్స్‌కో విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ జనార్దన్ నాయుడు, ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యంరెడ్డి అన్నారు. విద్యుత్ ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏపీటీఎస్ విజిలెన్స్ పోలీసులతో తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. వీడియో, ఆడియో, వాల్‌పోస్టర్లు, కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి విధిగా ఎర్తింగ్ ప్రమాణాలు కలిగిన పరికరాలు ఉపయోగించుకోవాలన్నారు. ముఖ్యంగా వ్యవసాయ బోర్ల వద్ద భద్రత నియమాలు మరింత విధిగా పాటించాలని పేర్కొన్నారు. అతుకులు లేని వైర్లను ఉపయోగించాలన్నారు. అధికశాతం విద్యుత్ ప్రమాదాలు నిర్లక్ష్యంతోనే సంభవిస్తున్నాయన్నారు. వర్షాలు కురుస్తున్నప్పుడు తడిసిన విద్యుత్ స్తంభాలు, వైర్లను తాకరాదన్నారు. తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా తక్కువ ఎత్తులో ఉన్న తీగలను ముట్టుకోవద్దన్నారు. పశువులను మేతకు తీసుకెళ్లినప్పుడు ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ భద్రతపై ప్రజలు మెరుగైన అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యుత్ సంబంధిత సమస్యలు లేదా అనుమానాలు ఉంటే వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించాలన్నారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలని కోరారు.

కూటమిలో చేరి.. భూమిని దోచేసి!


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు


రాచగుడిపల్లెలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి

- టీడీపీ మద్దతుతో ఇన్‌చార్జి ఎంపీపీని దక్కించుకున్న నల్లగొండు లక్ష్మీదేవి
- ఎన్నికైన కొద్ది రోజులకే భూ ఆక్రమణలకు పాల్పడుతున్న ఎంపీపీ భర్త
- తహసీల్దార్‌కు గ్రామస్తుల ఫిర్యాదు

ఒంటిమిట్ట : గ్రామాల అభివృద్ధికి ఉపయోగపడాల్సిన ప్రభుత్వ భూములను తెలుగు తమ్ముళ్లు దర్జాగా దోచేస్తున్నారు. రెవెన్యూ అధికారులకు ఈ విషయం తెలిసినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఒంటిమిట్ట మండలం రాచగుడిపల్లి గ్రామంలో గల సర్వే నంబరు 9లోని 79 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఇటీవల ఇన్‌చార్జి ఎంపీపీగా ఎన్నికైన నల్లగొండ లక్ష్మీదేవి భర్త నల్లగొండ వెంకట సుబ్బారెడ్డి గతంలో ఆవుల మంద ఉన్న 80 సెంట్ల భూమిని ఆక్రమించినట్లు రాచగుడిపల్లి గ్రామస్తులు బుధవారం తహసీల్దార్ వెంకటరమణమ్మకు వినతిపత్రం అందజేశారు. భూమిని ఆక్రమించుకోవడమే కాకుండా ఫెన్సింగ్ పనులు చేపట్టినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరేందుకు కారణం భూ కబ్జాలు చేసేందుకేనని పలువురు ఆరోపిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలాంటి భూ ఆక్రమణలు జరగలేదని, కేవలం కూటమి ప్రభుత్వం వచ్చాకే అధికారాన్ని అడ్డుపెట్టుకొని కూటమి నాయకులు భూ కబ్జాలకు పాల్పడుతున్నారని మండల ప్రజలు పేర్కొంటున్నారు.

అధికారం, డబ్బు పలుకుబడితోనే భూ కబ్జా..

టీడీపీలో చేరిన తరువాత తమ అధికారం, డబ్బు పలుకుబడి చూపి ప్రభుత్వ భూములను నల్లగొండ వెంకట సుబ్బారెడ్డి దర్జాగా దోచుకుంటున్నాడు. దీనిపై స్థానిక రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.**కత్తి నరసింహ, రాచగుడిపల్లి గ్రామస్తుడు**

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం..

రాచగుడిపల్లిలో 80 సెంట్లు ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లు బుధవారం గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. భూ కబ్జా నిజమా కాదా అన్న విషయంపై తమ సిబ్బందితో విచారణ చేయించి చర్యలు తీసుకుంటాం.

వెంకటరమణమ్మ, తహసీల్దార్, ఒంటిమిట్ట మండలం

హత్యాయత్నం కేసులో ఐదేళ్ల జైలు శిక్ష

కడప అర్బన్ : కడప నగరం ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏడు రోడ్ల సమీపంలో జనతా మెడికల్ స్టోర్ వద్ద నివాసముంటున్న సులోచనపై అతని సోదరుడు, సిద్దవటం మండలం మంగనవాండ్లపల్లికి చెందిన కారుమంచి సురేష్ అలియాస్ హరిప్రసాద్ నాయుడు 2020 ఫిబ్రవరి 2వ తేదీన మటన్‌కొట్టే కత్తితో తలపై, భుజంపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. బాధితురాలు సులోచనకు ఆమె భర్త రాఘవరెడ్డి చికిత్స చేయించారు. కేవలం తన అవసరాలకు డబ్బులు ఇవ్వలేదని సోదరుడు ఈ చర్యకు పాల్పడినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ బి.మధుసూదన్‌రెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేశారు. ఈ సంఘటనపై నేరం రుజువు కావడంతో నిందితుడికి ఐదు సంవత్సరాల జైలు శిక్షతో పాటు, రూ.70 వేలు జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సివిల్ జడ్జి జి.జి ఆసిఫా సుల్తానా తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.శ్రీనివాసులు తమ వాదనలను వినిపించారు. ఈ కేసు వివరాలను ప్రస్తుత సీఐ బి. రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. తగిన సాక్ష్యాధారాలతో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్ కుమార్ అభినందించారు.

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో కఠిన కారాగార శిక్ష

రాయచోటి టౌన్ : ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో అన్నమయ్య జిల్లా పీలేరు మండలం, మారంరెడ్డిగారిపల్లె గ్రామానికి చెందిన అరవ వెంకట ఆదినారాయణ అనే ముద్దాయికి తిరుపతి ఆర్‌ఎస్‌ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి ఏ. నరసింహమూర్తి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.6 లక్షలు జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. 2021 సంవత్సరం జనవరి 11వ తేదీ రాత్రి వాయల్పాడు ఎస్ఐ యు. వెంకటేశ్వర్లు తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో మదనపల్లె - తిరుపతి రహదారిలో ఏపీ04పిడబ్ల్యూ 3719 అనే నంబర్ గల స్కార్పియో వాహనం అతి వేగంగా వచ్చింది. ఆ వాహనాన్ని ఆపేందుకు ప్రయత్నించగా డ్రైవర్ వాహనాన్ని కుడి వైపునకు తిప్పి పక్కనే ఉన్న చింత చెట్టును ఢీకొట్టాడు. వెంటనే ఎస్ఐ తన సిబ్బందితో కలిసి స్కార్పియో వాహనాన్ని తనిఖీ చేయగా అందులో ఎర్రచందనం దుంగలతో పాటు గుండ్లూరు చంగల్‌రెడ్డి, అరవ వెంకట ఆదినారాయణ రాజు, దళాలి నారాయణ రాజు అనే ముగ్గురు నిందితులను పట్టుకొని సీఆర్ నంబర్ 6/2021 ముగ్గురిపై కేసు నమోదు చేశారు. దీనిపై విచారణ సాగించిన కోర్టు బుధవారం అరవ వెంకట ఆదినారాయణ రాజుకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించడంతో పాటు రూ.6లక్షలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించలేకపోతే మరో 6 నెలలు జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించారు. మిగిలిన ఇద్దరు ముద్దాయిలు కేసు విచారణలో ఉండగా మరణించారు. నిందితులకు శిక్ష పడే విధంగా సకాలంలో సాక్ష్యులను కోర్టుకు హాజరు పరచిన వాయల్పాడు హెడ్‌కానిస్టేబుల్ ఎస్. రమేష్, కోర్టు లైజాన్ హెడ్ కానిస్టేబుల్ కె. శ్రీనివాసులును జిల్లా ఎస్పీ అభినందించారు.

స్కూల్ అసిస్టెంట్లను ప్రైమరీ స్కూల్‌కు పంపడం సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ

మదనపల్లె సిటీ : పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన జీఓ 19లో మిగులు స్కూల్ అసిస్టెంట్లను మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంలుగా పంపడం సరికాదని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్) రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆపస్ కార్యాలయంలో జరిగిన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. డీమోషన్ నిర్ణయం ఉపసంహరించుకుని సమాంతరంగా తెలుగు మీడియం కొనసాగిస్తూ,విద్యార్థుల సంఖ్య 45 దాటితే రెండవ సెక్షన్‌గా పరిగణించి ఆ తర్వాత ప్రతి 30 మందికి మరొక సెక్షన్ కేటాయిస్తూ మిగులు స్కూల్ అసిస్టెంట్లను హైస్కూల్, యుపీ స్కూల్స్‌కు మాత్రమే కేటాయించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు నరసింహులు మాట్లాడుతూ ప్రాథమికోన్నత పాఠశాలల్లో కూడా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు తగినంత స్కూల్ అసిస్టెంట్ పోస్టులను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రమణారెడ్డి, రాజేశ్వరి, రెడ్డిశేఖర్, నాయకులు సిద్దారెడ్డి, రమణ, కొండారెడ్డి, గిరీష్, గోపాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.